# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం 8 ఫిబ్రవరి 2025 | తెలంగాణ ప్రాంతీయం | పేజీలు 8




## ముల్కనూర్‌లో పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి పొన్నం

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో గత మూడు రోజులుగా పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా శుక్రవారం రోజు హుస్నాబాద్ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పెద్దమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.



2లో..

## బోధన నాణ్యతపై హెడ్ మాస్టర్‌లు దృష్టి సారించాలి

- 10వ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి
- విద్యలో మనం సాధిస్తున్న విజయాలపై విస్తృత ప్రచారం కల్పించాలి
- విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యాసన స్థాయిలలో నాణ్యత పరమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యా శాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు.

ఖమ్మం, ఫిబ్రవరి 07(నినాదం న్యూస్) :

## నల్ల పోచమ్మ ఆలయంలో కార్పొరేటర్ పూజలు



2లో..



## అడవి తల్లుల జాతరకు.. అంకురార్పణ

- మినీ మేడారంకు సర్కార్ ఏర్పాట్లు
- రూ.32 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- మొక్కులు తీర్చుకోనున్న భక్తులు
- 20 లక్షల మంది వస్తారనే అనా
- ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు

ప్రతి రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతరలో బాగమైన మినీ మేడారంకు అంకురార్పణ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పిలువబడే గిరిజనుల ఆరాధ్యదైవాలైన శ్రీ సమ్మక్క- సారలమ్మ మహాజాతర ముగిసిన ఏడాదికి నిర్వహించే మినీ జాతరలో అడవి తల్లుల పున దర్శనానికి సమయం ఆసన్నమైంది. మేడారం జారతలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం మినీ మేడారంను కుంభమేళా తరహాలో నిర్వహించేందుకు కసరత్తులు చేసింది. ఈ క్రమంలో లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తుండగా వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.. ఇప్పటికే మినీ మేడారం జాతరలో ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ,32కోట్ల నిధులు కేటాయించింది. ఈ క్రమంలో కలెక్టర్ పర్యవేక్షణలో చకచకా పనులు జరుగుతున్నాయి. వారం రోజుల ముందుగానే జాతరకు అంకుర్పారణ జరుగగా బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు అమ్మవార్లు దర్శనం ఇవ్వనున్నారు.

వివరాలు 3లో

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):

## అగ్ని ప్రమాదాలు అవగాహన అప్రమత్తత అవసరం ఉంది

2లో..

- ముందస్తు జాగ్రత్తల ద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు సత్వర స్పందన ద్వారా నష్టతీవ్రత తగ్గుతది
- అధికారులు సిబ్బంది విపత్తు నిర్వహణ విధానాల మీద సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి
- రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు



## బోధన నాణ్యతపై హెడ్ మాస్టర్లు
# దృష్టి సారించాలి

- 10వ తరగతి ఫలితాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి.
- విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

**ఖమ్మం, ఫిబ్రవరి 07(నినాదం న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల అభ్యాసన స్థాయిలలో నాణ్యత పరమైన పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులతో పదవ తరగతి పరీక్షల సన్నద్ధత, విద్యా శాఖ కార్యక్రమాలపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూలి ప్రైవేట్ కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు విద్య అందుతుందన్న నమ్మకం తల్లిదండ్రులకు కల్పించాల్సిన బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయులపై ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల బోధన పద్ధతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పిల్లలకు పాఠ్యాంశం సులభంగా అర్థమయ్యేలా బోధన జరగాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పిల్లలకు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు, సబ్జెక్టు బోధించే అంశంలో ఉపాధ్యాయుల దగ్గర ఏవైనా లోపాలు ఉన్నాయా గమనించి అవసరమైన సలహాలను టీచర్లకు హెడ్ మాస్టర్ లు సూచించాలన్నారు. మార్కులపై మాత్రమే కాకుండా పిల్లలకు ఎంత వరకు అర్థం అవుతుంది, చివరి బెంచ్ విద్యార్థికి కూడా సబ్జెక్టుపై ఆసక్తి కల్గించేలా చేయాలని, టీచర్లకు అవసరమైన గైడెన్స్, శిక్షణ అందించాలని అన్నారు. పాఠశాల తరగతి గదిలో పిల్లలతో ఇంటరాక్షన్ ఎక్కువ జరగాలని, పిల్లల ఏకాగ్రత పెంచేలా బోధన చేయాలని అన్నారు. కొంత వెనుకబడిన విద్యార్థులతో ప్రత్యేకంగా కూర్చుని మాట్లాడాలని అన్నారు. రాబోయే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం పిల్లలు చదువుపై శ్రద్ధ పెట్టేలా తల్లిదండ్రులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ పని చేయాలని అన్నారు.పరీక్షల సమయంలో విద్యార్థులు పౌష్టికాహారం మాత్రమే తీసుకునేలా అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి అర్హతకు 10వ తరగతి మార్కులే ప్రధానమని, ఉద్యోగ ఇంటర్వ్యూకు వెళ్ళినప్పుడు 10వ తరగతి మార్కులను చూస్తారే గాని ధనిక, పేద వర్గాలని చూడరని అన్నారు.మనమంతా ధృఢ సంకల్పంతో, పట్టుదలతో పనిచేస్తే మన పాఠశాల స్థాయి మరింత ఉన్నతంగా మారుతుందని, తద్వారా రాబోయే తరం నాణ్యమైన సమాజాన్ని నిర్మిస్తుందని అన్నారు.ప్రభుత్వ విద్యారంగం వైభవానికి మనమంతా కలిసి పని చేయాలని, ఒకే రోజు అద్భుతమైన మార్పు సాధ్యం కాకపోయినా పాజిటివ్ డైరెక్షన్ వైపు మనం పని చేయడం ప్రారంభిస్తే కొన్ని సంవత్సరాల తర్వాత ప్రభుత్వ విద్యలో అద్భుతమైన మార్పులు వస్తాయని, విద్యతో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు మంచి పునాది వేయాలని కలెక్టర్ తెలిపారు. అమ్మా, నాన్నలతో పాటు పిల్లల భవిష్యత్తును మంచి మార్గంలో నడిపించే అవకాశం గురువుకి దొరుకుతుందని, విద్యార్థులు మంచి విద్యను అందించి వారి జీవితాల్లో మార్పు తీసుకొని వచ్చేలా పని చేయాలని కలెక్టర్ సూచించారు. ఉపాధ్యాయులు పిల్లల కోసం పని చేస్తున్నా మన్న బాధ్యతను దృష్టిలో ఉంచుకోవాలని, ఉపాధ్యాయుడిగా ఎంత మందిని పిల్లలను ప్రయోజకులుగా చేశామనేది ముఖ్యమని, మన వల్ల ఇంత మంది పిల్లలు ప్రయోజకులు అయ్యారంటే మనకు గర్వంగా ఉంటుందని అన్నారు. విద్యార్థులకు ఉన్న ఆసక్తులను గమనించి వారిని ఆ రంగాలలో ప్రోత్సహించాలని, పరీక్షలపై విద్యార్థులకు ఉన్న భయాన్ని తొలగించి, నమ్మకంతో సునాయసంగా పరిక్షలు రాసేందుకు కృషి చేయాలని, విద్యార్థుల విద్యా స్థితి గతులను పరీక్షిస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు మనవంతు సహకారం అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు.ప్రతి ఒక్క ఉపాధ్యాయులు పంచసూత్రాలైన ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని, సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చూడాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల కొంతమంది ప్రజలకు ఉన్న అపోహలు తొలగించే దిశగా, విద్యా వ్యవస్థలో ప్రభుత్వం నూతనంగా కల్పిస్తున్న వసతులు, పాఠశాలలో మారుతున్న బోధన పద్ధతులు, వస్తున్న ఫలితాలపై ప్రచారం కల్పించి ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం పెంచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, కల్పించబడ్డ వసతులు, అలాగే మన విద్యార్థులు సాధించిన ఫలితాలు అందరికి, ముఖ్యంగా తల్లిదండ్రులకు తెలిసే లాగా చేయాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగే విధంగా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖ అధికారి సోమశేఖర శర్మ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలు అవగాహన
# అప్రమత్తత అవసరం ఉంది

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి7 (నినాదం న్యూస్):** ఇటీవల తరచుగా అగ్ని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలో విపత్తు నిర్వహణ కొరకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు నష్ట నివారణ కొరకు తీసుకోవాల్సిన అత్యవసర చర్యల గురించి అవగాహనా కల్పించారు. అందులో భాగంగా కమిషనర్ సుధీర్ బాబు రాచకొండ కార్యాలయంలో డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసిపిలు కమిషనరేట్ పరిధిలోని అందరు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విపత్తు నిర్వహణ చర్యల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ పెట్రోలియం సంస్థ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ విపత్తు నిర్వహణ బృంద ప్రతినిధులు తాము పాటించే విపత్తు నిర్వహణ విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు అనేవి ఆకస్మాత్తుగా సంభవించేవని, సరైన అవగాహన లేకపోవడం వల్ల ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా జరిగే ప్రాణనష్టం ఆస్తినష్టం అత్యధికంగా ఉంటుందని పేర్కొన్నారు. కర్మాగారాల్లో, పారిశ్రామిక వాడల్లో అకస్మాత్తుగా జరిగే అగ్నిప్రమాదాలను అదుపు చేయడంలో సరైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల మరియు విపత్తు నిర్వహణ బృందాలకు సత్వరమే సమాచారం అందించకపోవడం వల్ల నష్టం మరింతగా పెరుగుతోందని తెలిపారు. పారిశ్రామిక వాడల్లో జరిగే బాయిలర్ పేలుళ్ల వల్ల సమీప కర్మాగారాలకు మంటలు అంటుకోవటంతో ప్రాణనష్టం, ఆస్థినష్టం అధికంగా జరుగుతోందని అన్నారు. పెట్రోలియం కర్మాగారాల్లో జరిగే ప్రమాదాలు పెట్రోలియం ఉత్పత్తులను ట్యాంకర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు సరఫరా చేసే సమయంలో జరిగే రోడ్ల ప్రమాదాలలో సంభవించే అకస్మాత్తు భారీ అగ్నిప్రమాదాల వల్ల సామాన్య ప్రజల వాహనాలు మంటల్లో చిక్కుకోవడంతో పాటు భారీస్థాయిలో ట్రాఫిక్ జామ్ వంటి పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. సంఘటనా స్థలానికి వీలైనంత తక్కువ సమయంలో చేరుకోవడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించవచ్చని కాబట్టి అధికారుల స్పందన వేగంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో అత్యవసర విపత్తు నిర్వహణలో పాల్గొనే సిబ్బంది తగిన జాగ్రత్తలు శిక్షణ తీసుకోకపోవడం వల్ల వారు కూడా ప్రమాదంలో పడే అవకాశం ఉందని కాబట్టి వారు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. విపత్తు నిర్వహణ కొరకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అందరూ అవగాహన పెంచుకోవాలని, అధికారులు తమ సిబ్బందికి ఎప్పటికప్పుడు అంతర్గత శిక్షణ కార్యక్రమాల ద్వారా శిక్షణ ఇవ్వాలని సూచించారు. పెట్రోలింగ్ వాహనాల్లో విపత్తు నిర్వహణ కిట్లను అందుబాటులో ఉంచాలని, విపత్తు నిర్వహణ మరియు అగ్ని మాపక సేవల శాఖ ద్వారా రాచకొండ పరిధిలో నివాస గృహాలు, పరిశ్రమలు, పాఠశాలలు, గోదాములు, షాపింగ్ కాంప్లెక్స్ లు ఇతర ప్రదేశాల్లో అకస్మాత్తుగా సంభవించే అగ్ని ప్రమాదాలను నివారించడానికి అవగాహన కార్యక్రమాలు రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి విపత్తు నిర్వహణ ప్రమాణాల ప్రకారం జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అగ్ని ప్రమాదం జరిగినా తక్షణమే 101 టోల్ ఫ్రీ నంబర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ మల్కాజ్గిరి పద్మజ ఐపిఎస్, డిసిపి యాదాద్రి రాజేష్ చంద్ర ఐపిఎస్, డిసిపి ఎల్బీనగర్ ప్రవీణ్ కుమార్ ఐపిఎస్, డిసిపి క్రైమ్ అరవింద్ బాబు, డిసిపి మహేశ్వరం సునీత రెడ్డి, డిసిపి ఎస్ఓటి 1 రమణారెడ్డి, ఎస్బి డిసిపి నరసింహారెడ్డి, డీసీపీ ట్రాఫిక్ శ్రీనివాస్, డిసిపి అడ్మిన్ ఇందిర, అదనపు డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఏసిపి ఐటి సెల్ నరేందర్ గౌడ్, ఏసిపి సి.సి.ఆర్.బి రమేష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ ఆలయంలో కార్పొరేటర్



**అల్వాల్, జనవరి 7 (నినాదం న్యూస్) :** వెంకటరావుపేట వెంకటాపురం లోని శ్రీ నల్ల పోచమ్మ టెంపుల్ దేవి వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కమిటీ మెంబర్లు సాదరంగా ఆహ్వానించి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. శనివారం సాయంత్రం అన్న ప్రసాద వితరణ ఉంటుందని టెంపుల్ మేనేజ్మెంట్ కమిటీ తెలియపరిచారు వెంకటరావుపేటలో సమస్యలపై ఆరా తీశారు ,ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు కే వాణి శైల్వి, విశాల్ రామానుజం ఖాదీ మారం సాగర్ స్థానిక నాయకులు యాదగిరి గౌడ్, ప్రేమ్ కుమార్, సాజిద్, అరుణ్, స్థానికులు పాల్గొన్నారు

# అభివృద్ధి చూసి ఓర్వలేక మంత్రిపై విమర్శలు

**భీమదేవరపల్లి ఫిబ్రవరి07 (నినాదం న్యూస్) :** హుస్నాబాద్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేస్తున్న అభివృద్ధి చూసి మాజీ ఎంఎల్ఎ సతీష్ కుమార్ మాట్లాడాలని కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షులు ఊసకోయిల ప్రకాష్ అన్నారు. శుక్రవారం భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రిపై నియోజవర్గంలో అభివృద్ధి చేస్తుంటే తప్పుడు ప్రచారాలు చేయడం తగదన్నారు. గ్యారంటీలు అమలు కావడంలేదని మాట్లాడిన మాజీ ఎంఎల్ఎ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200యూనిట్లు ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, రైతులకు రూ.5వందల బోనస్ అందించిన విషయం తెలుకొని



మాట్లాడాలన్నారు. గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వలేదని ప్రజా ప్రభుత్వం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే కార్యక్రమం మొదలుపెట్టిందని తెలుసుకోవాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ అనేక పథకాలు తీసుకువస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జెల రమేష్, జక్కుల అనిల్, చిట్యాకరి రామచంద్రం, తాళ్లపెల్లి సదానందం, మహమ్మద్ వలీ, భాష, గొల్లపెల్లి రవి. తాడూరి భాస్కర్ తదితరులు ఉన్నారు.

# అడవి తల్లుల జాతరకు అంకురార్పణ

- మినీ మేడారంకు సర్కార్ ఏర్పాట్లు
- రూ.32 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం
- మొక్కులు తీర్చుకోనున్న భక్తులు
- 20 లక్షల మంది వస్తారనే అంచనా
- ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం చర్యలు

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):ప్రతి రెండేళ్లకోసారి జరిగే వనదేవతల జాతరలో బాగమైన మినీ మేడారంకు అంకురార్పణ జరిగింది. ఆసియాలోనే అతిపెద్ద జాతరగా పిలువబడే గిరిజనుల ఆరాధ్యదైవాలైన శ్రీ సమ్మక్క- సారలమ్మ మహాజాతర ముగిసిన ఏడాదికి నిర్వహించే మినీ జాతరలో అడవి తల్లుల పున దర్శనానికి సమయం ఆసన్నమైంది. మేడారం జారతలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం మినీ మేడారంను కుంభమేళా తరహాలో నిర్వహించేందుకు కసరత్తులు చేసింది. ఈ క్రమంలో లక్షలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తుండగా వారికి ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే మినీ మేడారం జాతరలో ఏర్పాట్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ,32కోట్ల నిధులు కేటాయించింది. ఈ క్రమంలో కలెక్టర్ పర్యవేక్షణలో చకచకా పనులు జరుగుతున్నాయి. వారం రోజుల ముందుగానే జాతరకు అంకుర్పారణ జరుగగా బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు అమ్మవార్లు దర్శనం ఇవ్వనున్నారు.

**12నుంచి 15వరకు మొక్కులు**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈనెల 12 నుంచి 15 వరకు నాలుగు రోజులు పాటు మినీ మేడారం జాతర జరగనుంది. జాతర ప్రారంభానికి సరిగ్గా వారం రోజుల ముందు గుడిశుద్ధి (మండ మెలిగె) పండగను నిర్వహిస్తుంటారు. బుధవారం సమ్మక్క, సారలమ్మ పూజారులు గుడిశుద్ధి పండగకు శ్రీకారం చుట్టి జాతరకు అంకురార్పణ చేశారు. దీంతో మేడారం పరిసర ప్రాంతాల్లోని గిరిజన గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. వారం రోజుల ముందు నుంచే పూజారులు గిరిజనుల సాంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహిస్తున్నారు.

**అభివృద్ధి పనులకు రూ.32 కోట్ల కేటాయింపు**

మినీ మేడారం జాతరకు ప్రభుత్వం రూ. 32కోట్లు కేటాయించింది. గతంలో కంటే భిన్నంగా ఈసారి మంత్రి సీతక్క చొరవతో జాతరకు మూడు నెలల ముందే రూ. 32 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. ఇందులో పంచాయతీరాజ్? శాఖ నుంచే రూ. 22 కోట్లతో రోడ్ల పనులు ప్రారంభం అయ్యాయి. మేడారం, కన్నెపల్లి, కాల్వపల్లి, ఊరట్టం గ్రామాల్లో సీసీ రోడ్లు, పీఆర్ రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. మేడారం గద్దెల వద్దకు వచ్చే క్యూలైన్లపై పర్మినెంట్‌గా చలువ పందిళ్ల నిర్మాణం కోసం రూ. 3 కోట్లు ఖర్చు చేస్తున్నారు. అలాగే దేవాదాయ శాఖ ద్వారా రూ. 5. 50 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ. 1. 80 కోట్లతో మేడారం, కన్నెపల్లిలో శ్రీ సమ్మక్క, సారలమ్మల ఆలయాలు నిర్మిస్తున్నారు. రూ. 1. 50 కోట్లతో పూజారుల గెస్ట్‌హౌజ్, రూ. 2. 20 కోట్లతో వీవీఐపీ గెస్ట్‌హౌజ్ పనులు చేపట్టారు.

**20లక్షల మంది భక్తుల వస్తారనే అంచనా**

భక్తుల కొంగు బంగారం శ్రీ సమ్మక్క సారలమ్మ కొలువుదీరిన మేడారం మినీ జాతరకు భక్తుల తాడికి మొదలైంది. ఈ జాతరకు సుమారు 20 లక్షల మందికి





పైగా భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. భక్తుల తాకిడికి తగ్గట్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. వనదేవతలను దర్శించుకునేందుకు నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మినీ జాతరకు సైతం మహారాష్ట్ర, చత్తీస్గడ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు.

**గిరిజన సంప్రదాయ ప్రకారం...**

మేడారంలో ప్రతి రెండేళ్లకోసారి సమ్మక్క సారలమ్మ మహాజాతర జరుగుతుంది. ఈ జాతర ముగిసిన ఏడాది తర్వాత గిరిజన సంప్రదాయం ప్రకారం మండమెలిగె పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. దీనినే మినీ మేడారం జాతరగా భక్తులు పిలుచుకుంటారు. ఈ సమయంలో అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు తరలివస్తారు. ఈ క్రమంలో శ్రీ సమ్మక్క సారలమ్మ వన దేవతల పూజారులు సంప్ర దాయబద్ధంగా పూజలు నిర్వహిస్తారు. మినీ జాతరను సక్సెస్ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నది

# తిరగబడిన రోటిబండ తాండ మహిళలు

### -ఫార్మా కారిడార్ కు భూములు ఇవ్వబోమంటూ హెచ్చరిక

### -భారీగా మోహరించిన పోలీసు బలగాలు

### -పోలీసు పహారా మధ్య కొనసాగిన భూసర్వే





**కొడంగల్, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్)** ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు కోసం భూసేకరణ సర్వే కు వచ్చిన అధికారులను లగచర్ల సమీపంలోని రోటిబండ తాండ మహిళలు అడ్డుకున్నారు.ఇదివరకే ఓ కాంగ్రెస్ నాయకుడిని దిగ్బంధం చేసిన సంగతి తెలిసిందే, అనంతరం లగచర్ల ఘటన అందిరికీ తెలిసిన సంగతే.పరిస్థితి మళ్ళీ పునరావృతం కారాదని ముందస్తుగానే రెండువందల కు పైగా పోలీసు బలగాలు రోటిబండ కు చేరుకున్నాయి.అధికారులు తాండా కు రాగానే తాండలో ఉన్న మహిళలు, యువకులు ప్లకార్డులు,కర్రలు చేతపట్టుకుని, గోబ్యాక్,ప్రాణాలు పోయినా సరే మాభూములు మాత్రం ఇవ్వం,మా భూముల జోలికి రావద్దు, మాభూముల్లో సర్వే చేయరాదు అంటూ నినాదాలు చేశారు.ఎట్టిపరిస్థితుల్లోనూ సర్వే చేసేది లేదంటూ మొండికేశారు.తమక బ్రతకడానికి ఏ కంపనీ అవసరం లేదు, మాకున్న కొద్ది పాటి భూములే మాకు జీవనాధారం అంటూ ఘంటా పథంగా తెలిపారు. ఇదివరకు జైల్లో నిర్భంధించిన వారిపై కేసులు కొట్టివేయాలని డిమాండ్ చేశారు.

**పోలీసు పహార మధ్యలో కొనసాగిన భూసర్వే**

రైతులు మొండికేయడంతో అధికారులు రైతులను పట్టించుకోకుండా పోలీసు బలగాల మధ్యలో భూసర్వే కొనసాగించారు.రైతుల నిరసన తట్టుకోలేక, ప్రభుత్వ అనుమతిని కాదనలేక లగచర్ల, రోటిబండ తాండ, పులిచర్ల తాండాలలో మొత్తం 110 ఎకరాలు భూసర్వే జరిగినట్లు అధికారులు తెలిపారు. లగచర్ల గ్రామ శివారులోని గైరాన్ భూమి, సిలింగ్ భూములు సర్వే.నం. 102,117,120 అండ్ 121 లలో మొత్తం విస్తీర్ణం ఎకరాల110. 32 గుంటలు భూములు నాల్గు సర్వే బృందములుగా ఏర్పాటు చేసి భూసర్వే కొనసాగించినట్లు తహసీలార్ కిషన్ నాయక్ తెలిపారు. సర్వే చేసీన భూముల కు హద్దులు నిర్ణయించి సర్వే ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



### డా"ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్‌తో

# గోడువెల్లబోసుకున్న 19 సర్వేనంబర్ భూబాధితులు



కొడంగల్, ఫిబ్రవరి7 (నినాదం న్యూస్ ): కొడంగల్ శివారులోని అప్పాయిపల్లి సర్వేనంబర్19లో మెడికల్ కళాశాల, వెటర్నరీ కళాశాల ఏర్పాటు కు రైతుల నుంచి భూసేకరణ చేసిన రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం జరగలేదంటూ శుక్రవారం రోజు బిఆర్ ఎస్ నేత డా"ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్, జర్నలిస్ట్ శంకర్ లను కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు రైతులు.ఈసందర్భంగా వారితో రైతులు మాట్లాడుతూ, భూసేకరణ విషయంలో ఎకరానికి పదిలక్షల రూపాయలు,125 గజాల ఇంటిస్థలం, కుటుంబం లో ఒకరికి ఉద్యోగం ఇస్తామని, తమపై పెట్టిన కేసులు ఎత్తివేస్తామన్న సర్కారు,తమవద్ద నుంచి భూములు తీసుకున్నారు కానీ తమకు న్యాయం జరగలేదని గోడు వెల్లబోసుకున్నారు. అసలైన రైతులకు న్యాయం జరగలేదని, భూమి లేని వారికి నష్టపరిహారం అందించి, తమకు అరకొర డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకున్నారనీ వాపోయారు. తమకు మద్దతుగా నిలిచి, మాకు న్యాయం జరిగేందుకు సర్కారు పై సమరానికి మీగొంతు వినిపించాలనీ ఆరెస్పీ,మరియు జర్నలిస్ట్ శంకర్ లతో మొరపెట్టుకున్నారు ఈకార్యక్రమంలో19 సర్వే నంబర్ రైతులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్, అగ్గనూరు మల్లప్ప, అమృతప్ప, పిల్లికండ్ల ఆశమ్మ, బసప్ప, వెంకటమ్మ, నరసింహులు,తదితరులు పాల్గొన్నారు.

### మస్తాన్ సాయి డ్రగ్స్ కేసులో

# రంగంలోకి నార్కోటిక్స్ పోలీసులు

**హైదరాబాద్,ఫిబ్రవరి7 (నినాదం న్యూస్ ):** విచ్చలవిడిగా డ్రగ్స్ వీడియోలు వైరల్‌గా మారడంతో నార్కోటిక్స్ పోలీసులు రంగంలోకి దిగారు. మస్తాన్ సాయి హార్డ్ డిస్క్‌లో డ్రగ్స్ వాడకం వీడియోలు భారీగా లభించింది. దీంతో డ్రగ్స్ తీసుకున్న వారి వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరిస్తున్నారు. గతంలోనూ మస్తాన్ సాయి, లావణ్యపై డ్రగ్స్ కేసులు ఉన్నాయి. తాజాగా వీరితో పాటు పార్టీల్లో పాల్గొన్న వారి వివరాలను సేకరిస్తున్నా నార్కోటిక్స్ పోలీసులు. ఎక్కడి నుంచి డ్రగ్స్ తీసుకొస్తున్నారు, ఎక్కడ పార్టీలు నిర్వహిస్తున్నారు, ఎంత మంది పాల్గొన్నారు అనే అంశాలపై ఫోకస్ పెట్టారు. ఇప్పటికే గుంటూరులో రాహుల్ అనే వ్యక్తిని నార్కోటిక్ పోలీసులు అరెస్ట్ చేశారు. మస్తాన్ సాయి డ్రగ్ పార్టీ వీడియోలో ఉన్న వారందరూ పరారయ్యారు. మస్తాన్ సాయి కేసులో నార్కోటిక్ పోలీసులు నిఘా పెంచారు. నార్సింగ్ పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయిని అరెస్ట్ చేసి జ్యూడీషియల్ రిమాండ్‌కు తరలించారు. యువతులను ట్రాప్ చేసి వారి నగ్న వీడియోలు చిత్రీకరించిన తర్వాత వాళ్లను బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడంటూ లావణ్య ఇచ్చిన ఫిర్యాదుతో మస్తాన్ సాయిని అరెస్ట్ చేశారు పోలీసులు. అయితే ఈ కేసులో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. మస్తాన్ సాయి ఇంట్లో జరిగిన పార్టీలకు సంబంధించిన వీడియోలో బయటకు వచ్చాయి. అందులో చాలా మంది యువతీ యువకులు పార్టీలో డ్రగ్స్ తీసుకుంటున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో నార్కోటిక్ పోలీసులు డ్రగ్స్ వ్యహారంపై రంగంలోకి దిగారు. ఇప్పటికే గుంటూరు, నెల్లూరు జిల్లాలో నార్కోటిక్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మస్తాన్ సాయి స్నేహితుడు రాహుల్‌ను అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ పార్టీలో ఉన్న ఎనిమిది మంది అమ్మాయిలు, పది మంది అబ్బాయిల వివరాలను నార్కోటిక్ పోలీసులు సేకరించే పనిలో పడ్డారు. వారాంతంలో మస్తాన్ సాయి ఇంట్లోనే డ్రగ్స్ పార్టీలు నిర్వ హించేవాడు. అయితే వీడియోలు బహిర్గతం అవడంతో అందులో ఉన్న వారు పరారీలో ఉన్నారు. వారి మొబైల్స్‌ను స్విచ్ఆఫ్ చేసుకుని అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. ఏడు నుంచి ఎనిమిది సార్ల వరకు జరిగిన డ్రగ్స్ పార్టీల వీడియోలు బయటకు వచ్చాయి. డ్రగ్స్‌ను ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారనే దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మరోవైపు మస్తాన్ సాయిని కస్టడీకి కోరుతూ నార్సింగి పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఈరోజు మధ్యాహ్నాం తీర్పు వెల్లడిరచే అవకాశం ఉంది. మస్తాన్ సాయిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తే అసలు వాస్తవాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు పస్తులు

- నాణ్యమైన భోజనం పెట్టలేని స్థితిలో కాంగ్రెస్ సర్కార్
- ఒక్కపూట ఫొటోలకు ఫోజులివ్వడం కాదు
- నిత్యం మధ్యాహ్న భోజనంపై దృష్టిపెట్టు
- ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై కేటీఆర్ ఫైర్



హైదరాబాద్,ఫిబ్రవరి7(నినాదం న్యూస్): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించడం లేదని, పిల్లలను పస్తులు ఉంచుతున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోనే విద్యార్థులు ఆకలితో అలమటిస్తున్నారంటే, ఇక మంత్రుల నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదని ధ్వజమెత్తారు. ఢిల్లీకి మూటలు పంపడంపై ఉన్న శ్రద్ధ చిన్నపిల్లలకు భోజనం అందించడంలో సీఎంకు లేదంటూ విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటూ ఎక్స్ వేదికగా కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాగా, మహబూబ్‌నగర్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం నాచారం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనం అందించడం లేదంటూ పలు వార్తపత్రికలు ప్రచురించాయి. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికలకు వివాదం తలెత్తడంతో పిల్లలకు అన్నం పెద్దలేదన్న వార్తలు వెలువడ్డాయి. కొన్ని నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు కార్మికులు అరకొరగా భోజనం అందిస్తున్నారు. కొన్ని రోజులుగా ఆహారం నాణ్యతా లోపించడంతో వారి పస్తులు ఉంటూ తిరిగి ఇంటికి వెళ్లి భోజనం చేస్తున్నారు. పాఠశాల ప్రిన్సిపల్, మధ్యాహ్న భోజన కార్మికులకు మధ్య వివాదం నెలకొంది. దీంతో విద్యార్థులకు నిన్న భోజనం అందించలేదు. దీనిపై చిన్నారులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పగా ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న డీఈవో నేరుగా పాఠశాల వద్దకు వెళ్లి విచారణ చేపట్టారు. ప్రిన్సిపల్, వంట ఏజెన్సీ కార్మికులపై సీరియస్ అయ్యారు. దీనికి సంబంధించిన వార్తా పత్రికల క్లిపింగులను కేటీఆర్ తన ట్వీట్‌కు జత చేశారు. "పేదల గూళ్లపై బుల్డోజర్లు పంపడంలో ఉన్న ప్రేమ.. బడిపిల్లలకు బుక్కెడు బువ్వపెట్టడంలో లేదా?. అమృత్ స్కీమ్‌ను అప్పనంగా బామ్మర్దికి కట్టబెట్టడంలో ఉన్న తెలివి, బుక్కెడు బువ్వకు అలమటిస్తున్న పసిపిల్లల కడుపు నింపడంలో లేదా?. పారిశ్రామికవేత్త అదానీకి తెలంగాణ వనరులు దోచిపెట్టడంలో ఉన్న శ్రద్ధ.. ప్రభుత్వ పాఠశాలల దీనస్థితిపై లేదా?. మూసీ ప్రక్షాళన పేరుతో మూటలు కట్టి ఢిల్లీకి కట్టలు పంపడంలో ఉన్న ప్రేమ.. భవిష్యత్ భారతావని వారసులైన పసిపిల్లల ఆకలి కేకలపై లేదా?. మంత్రుల సంగతి దేవుడెరుగు, ముఖ్యమంత్రి ఇలాకాలోనే పిల్లల పస్తులు ఉంటున్నారు. మీ ఢిల్లీ బాసులు.. మీ గల్లీ దోస్తుల ఆకలి తీర్చడం కాదు రేవంత్.. ముందు మధ్యాహ్న భోజన పథకంపై దృష్టి పెట్టు. ఒక్కపూట ఫొటోలకు ఫోజులిచ్చి గప్పాలు కొట్టడం కాదు. నిత్యం గుప్పెడు అన్నం అందుతుందో లేదో సమీక్ష చేసి చూడు. ఇది ప్రజాపాలన కాదు.. ప్రజలను వేధించే పాలన" అంటూ ట్వీట్ చేశారు.

# సేవాలాల్ మహారాజ్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



కోదాడ, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):ఈ నెల15 వ తారీకున జరగనున్న శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఐచ్చిక సెలవు దినం కాకుండా సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని సేవాలాల్ సేన కార్మిక శాఖ అధ్యక్షుడు బానోతు శంకర్ నాయక్. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రతి మండలం. ప్రతి గ్రామంలో శ్రీ సంత్ సేవాలాల్ జయంతి జరుపుకోవాలని. కోరారు.జిల్లాలో సేవాలాల్ మహారాజ్ కమ్యూనిటీ హాల్ ఏర్పాటు చేయాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం జయంతికి ప్రతి జిల్లాకు రెండు కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పట్టపగలే ఇంట్లో చోరీ...

**-ఆరు తులాల బంగారం అపహరణ**



కోదాడ, ఫిబ్రవరి 7 ( నినాదం న్యూస్):

పట్టపగలే ఓ ఇంట్లో చోరీ జరిగి ఆరు తులాల బంగారం, 50వేల నగదు చోరీకి గురి అయిన సంఘటన పట్టణ పరిధిలోని బాలాజీ నగర్ లో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీ నగర్ కు చెందిన గుజ్జర్లపూడి శ్రీనివాసరావు, కృష్ణవేణి సరుకులు కొనేందుకు కోదాడ పట్టణానికి రాగా శ్రీనివాసరావు వ్యవసాయ పని నిమిత్తం పొలం దగ్గరికి వెళ్ళగా ఇంతలోనే గుర్తుతెలియని దుండగులు పట్టపగలే తాళం వేసిన ఇంటిని పగలగొట్టి ఇంట్లో ఉన్న మూడు ఉంగరాలు, గాజులు రెండు, ఒక పెద్ద ఉంగరం సుమారు ఆరు తులాల బంగారం, 50వేల రూపాయల నగదు దొంగిలించినట్లు గుర్తించారు. బాధితులు టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# సమస్యలపై నేరుగా తన వద్దకే రావాలి

హైదరాబాద్,ఫిబ్రవరి7(నినాదం న్యూస్): తెలంగాణ కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఎమ్మెల్యేల ప్రత్యేక భేటీలు సంచలనంగా మారాయి. దీంతో, తాజా పార్టీ ఎమ్మెల్యేలతో సీఎం రేవంత్ ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసారు. గీత దాటవద్దని.. ఏ సమస్య ఉన్నా తమ వద్దకు రావాలని సూచించారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ కేబినెట్ విస్తరణ.. నామినేటెడ్ పదవులు.. పీసీసీ కార్యవర్గం పై చర్చించనున్నారు. ఇదే సమయంలో రేవంత్ కేబినెట్ లో మరో డిప్యూటీ సీఎం పదవి బీసీ వర్గాలకు ఇవ్వాలనే ప్రతిపాదన పైన ఆసక్తి కర చర్చ మొదలైంది. తెలంగాణ కాంగ్రెస్‌లో కొందరు ఎమ్మెల్యేలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దీంతో, ఎమ్మెల్యేలతో నేరుగా సమావేశం కావాలని రేవంత్ నిర్ణయించారు. అందులో ముందుగా సీఎల్పీ సమావేశం ఏర్పాటు చేసారు. తాను చెప్పదలచుకున్నది స్పష్టం చేసారు. కొందరు ఎమ్మెల్యేలు తమ వాదన వినిపించారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ పార్టీ నేత కేసీ వేణుగోపాల్ తో సమావేశమయ్యారు. పార్టీలో చోటు చేసుకుంటున్న పరిణామాలు.. కుల గణన నివేదిక.. తాజాగా అసెంబ్లీ తీర్మానాల గురించి పార్టీ అధి నాయకత్వానికి వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తు గురించి వివరించనున్నారు.

## అదుపుతప్పి డివైడర్ ను ఢీకొట్టిన బైక్

**-మూడు పల్టీలు కొట్టిన బైక్...**

**-తీవ్ర గాయాలతో చికిత్స పొందుతూ యువకుడు మృతి**



కోదాడ, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్): అదుపుతప్పి డివైడర్ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన కోదాడ పట్టణంలో శ్రీనివాస్ నగర్ లో గురువారం అర్థరాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన గుండా ఈశ్వర్ బైపాస్ నుండి రోడ్డు క్రాస్ చేసి కోదాడ వైపు వస్తున్న క్రమంలో బైక్ అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టి డివైడర్ను ఢీ కొట్టిందని తెలిపారు. ఈశ్వర్ కు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈశ్వర్ మృతి చెందినట్లుగా తెలిపారు. ఈశ్వర్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపుతో ఊరట

ముంబై,ఫిబ్రవరి7(నినాదం న్యూస్): గృహ రుణ వినియోగదారులకు ఎట్టకేలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శుభవార్త చెప్పింది. రెపోరేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో దాని ప్రభావం గృహరుణదారులకు ఊరట కలిగించనుంది. ద్రవ్యోల్బణాన్ని దృష్టిలోపెట్టుకుంటూనే వృద్ధికి ఊతం ఇవ్వాలన్న ఉద్దేశంతో 25 బేసిస్ పాయింట్ల మేర రెపో రేటును తగ్గిస్తున్నట్లు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తెలిపారు. దీనికి మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో రెపోరేటు 6.50 శాతం నుంచి 6.25 శాతానికి తగ్గింది. ఐదేళ్ల నుంచి వడ్డీ రేట్లు పెరగడం తప్ప.. తగ్గడం చూడని హోమ్‌లోన్ కస్టమర్లకు ఇది ఊరట కల్పించే అంశమనే చెప్పాలి. ఆ మేరకు ఈఎంఐ తగ్గనుంది. ఆర్‌బీఐ తగ్గించిన రెపో రేటు పావు శాతమే అయినప్పటికీ గృహరుణ వినియోగదారులు నెలవారీ చెల్లించే ఈఎంఐలో చాలావరకు తేడా కనిపిస్తుంది. ఉదాహరణకు 20 ఏళ్ల కాలవ్యవధికి రూ.50 లక్షల రుణం తీసుకుంటే... 9 శాతం వడ్డీ అనుకుంటే నెలకు రూ.44,986 చెల్లించాల్సి ఉంటుంది. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో ఆ మొత్తం రూ.44,186కు తగ్గనుంది. అంటే దాదాపు నెలకు రూ.800 ఆదా అవుతుంది. గృహరుణం తీరడానికి ఇంకా పదేళ్ల సమయం ఉందనుకుంటే 120 నెలలకు రూ.800 చొప్పున దాదాపు రూ.96వేల వరకు మిగులుతుంది. ఆర్‌బిఐ రెపో రేటు తగ్గించిన నేపథ్యంలో రుణ గ్రహీతల ముందు ఇప్పుడు రెండు ఆప్షన్లు ఉండబోతున్నాయి. ఒకటి ఈఎంఐ తగ్గించుకోవడం. రెండోది కాలవ్యవధి తగ్గించుకోవడం. దీంట్లో రెండో ఆప్షన్ ఎంచుకోమని నిపుణులు చెబుతున్నారు. దీనివల్ల దీర్ఘకాలంలో ఎక్కువ మొత్తంలో వడ్డీని ఆదా చేసుకోవచ్చని పేర్కొంటున్నారు. పై ఉదాహరణనే మళ్లీ తీసుకుంటే.. రూ.50 లక్షల రుణంపై 9 శాతం వడ్డీ రేటు కింద 20 ఏళ్లకు 57.96 లక్షలు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఆర్‌బిఐ తాజా నిర్ణయంతో 8.75 శాతం వడ్డీ తగ్గినప్పుడు ఈఎంఐని స్థిరంగా కొనసాగిస్తే.. దాదాపు 10 నెలల గడువు తగ్గుతుంది.

## అర్ధరాత్రి సమయంలో లారీ దగ్ధం

**-పక్కనే ఉన్న పెట్రోల్ బంక్...తప్పిన పెను ప్రమాదం**

**-ట్రాన్స్పోర్ట్ లో ఆగి ఉన్న 500 పైగా లారీలు**



కోదాడ, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్): అర్థరాత్రి సమయంలో లారీ పూర్తిగా దగ్ధం ఆయన సంఘటన కోదాడ మండల పరిధిలోని రామాపురం క్రాస్ రోడ్ వద్ద గల ఓ లారీ ట్రాన్స్పోర్ట్ లో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం అర్థరాత్రి 12 గంటల సమయంలో ఓ లారీ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో ట్రాన్స్పోర్ట్ ఆవరణలో సుమారు 500 కు పైగా లారీలు ఉన్నాయి. అంతేకాకుండా ట్రాన్స్పోర్ట్ పక్కనే పెట్రోల్ బంకు సైతం ఉంది. ఫైర్ స్టేషన్ వారికి సమాచారం ఇచ్చిన వారు సకాలంలో స్పందించలేదని లారీ నిర్వాహకులు ఆరోపిస్తున్నారు.మిగతా లారీలకు అంటుకొని ఉంటే పెద్ద పెను ప్రమాదమే సంభవించేదని ట్రాన్స్పోర్ట్ నిర్వాహకులు భయాందోళనకు గురయ్యారు. ఆగి ఉన్న లారీకి షార్ట్ సర్క్యూట్ కావడంపై, షార్ట్ సర్క్యూట్ కారణంగా లారీ దగ్ధమైందా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనేది తెలియాల్సి ఉంది.

## అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకులుగా అజయ్ ఎన్నిక



**నర్సంపేట, ఫిబ్రవరి 8(నినాదం ):** సూర్యాపేటలో రెండు అరుణోదయ సంస్కృతిక సమాఖ్య మహాసభను శుక్రవారం నిర్వహించడం జరిగింది. మహాసభలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం ఆ కార్యవర్గానికి నూతనంగా రాష్ట్ర నాయకులుగా నర్సంపేట కు చెందిన గుర్రం అజయ్ ఎన్నిక కావడం జరిగింది.

ఈ సందర్భంగా గుర్రం అజయ్ మాట్లాడుతూ కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అన్నారు.నిత్యం ప్రజలు దోపిడీకి గురి అవుతున్న వారిని చైతన్య పరచడంలో అరుణోదయ సంస్కృతిక సమాఖ్యా ఎన్నో కళరంగాలను నిర్వహించి పాటల రూపంలో నాటికల రూపంలో గ్రామాల్లోకీ వెళ్లి ప్రదర్శనలు చేయడం జరిగిందన్నా రు.పంట పొలాలల్లో అమ్మాలక్కలు పాటలు పాడుకుంటూ పని కష్టంను మరిచిపోయేవారన్నారు.నేడు సినిమా రంగంలోని పాటలు ప్రైవేట్ పాటలు అంటూ ప్రజలని అర్థం లేని పాటలు పాడుతూ మన సంస్కృతికీ దూరం చేస్తున్నారన్నారు.కానూరి వెంకటేశ్వర్లు, రామారావు తమ జీవిత కళామంతా తమ జీవితం కలకోసమే దారాపోసి ప్రజల్ని చైతన్యం చేసారని పేర్కొన్నారు.ఇప్పుడు ఉన్న కళాకారులు పేరుకోసం, డబ్బు కోసం కళని అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఎంతో మంది అరుణోదయ సంస్కృతిక సమైక్య కళ రంగంలో పని చేసి అమరులను స్మరించుకొని వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్తానని,ఇప్పుడు ఉన్న విష సంస్కృతులకు వ్యతిరేకంగా పోరాడుతనని అజయ్ కుమార్ తెలిపారు.

# వ్యాపారుల దోపిడికి వత్తాసు పలుకుతున్న మార్కెట్ అధికారులు

## ఎనుమాముల మార్కెట్ ను సందర్శించిన అఖిల భారత రైతు సమాఖ్య బృందం



**వరంగల్ ఫిబ్రవరి7 (నినాదం న్యూస్):** రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలను మార్కెట్ మాయా జాలంలో దోపిడి చేస్తూ నిండా ముంచుతున్నారని వ్యాపారుల కబంధహస్తాల్లో మార్కెట్లు నడుస్తున్నాయని వారికి మార్కెట్ అధికారులు అండగా నిలుస్తున్నారని అఖిల భారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దారపు రమేష్ తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అన్నారు. అఖిలభారత రైతు సమాఖ్య (ఏఐకెఎఫ్), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ ను సందర్శించి రైతుల పంటల కొనుగోలు పరిస్థితి, కనీస వసతులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పెద్దారపు రమేష్,సోమిడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఏనుమాముల మార్కెట్ రైతుల పంటల దోపిడీకి అడ్డగా మారి రైతుల పంటలను చేస్తున్నారని వ్యాపారుల కనుసనల్లో మార్కెట్ వ్యవస్థ నడుస్తున్నదని వ్యాపారులందరు సిండికేట్ అయి వారి లాభాలను దృష్టిలో పెట్టుకొని పంటల ధరలను నిర్ణయిస్తూ జెండా పాట పెడుతున్నారని కనీసం ఆ జెండా పాట అయినా రైతులందరికీ ఉత్పత్తులకు వర్తింప చేయకుండా కుంటి సాకులతో మోసం చేస్తున్నారని తామే మార్కెట్ వ్యవస్థ అన్నట్లు వ్యవహరిస్తున్నారని వారికి మార్కెటింగ్ అధికారులు అండగా పిలుస్తున్నారని రైతు సంఘాలు రైతులకు అండగా నిలవకుండా మార్కెట్ సందర్శించకుండా అనేక ఆంక్షలు విధిస్తున్నారని ఈ క్రమంలో మిర్చి రైతులు ఎకరానికి లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి పంట పండించి మార్కెట్కు తీసుకువస్తే అంతర్జాతీయంగా మిర్చి పంటకు డిమాండ్ ఉన్న ఎనుమాముల మార్కెట్లో మాత్రం కేవలం 13 400 రూపాయల క్వింటాకు జెండా పాట పాడి ఆచరణలో ఎనిమిది వేలకు మించి కొనుగోలు చేయడం లేదని దీంతో రైతులకు కూలీలకు సరిపడా డబ్బులు సైతం వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని అమలు చేస్తే రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే మార్క్ ఫెడ్,నాఫెడ్ ద్వారా మిర్చి కొనుగోలు చేయించి కనీస మద్దతు ధర కింటాకు 25వేల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. మార్కెట్లో కనీస వసతుల సదుపాయాలను మెరుగుపరచాలని మార్కెట్ దోపిడిని అరికట్టి శాస్త్రీయ పద్ధతిలో పంటల ధరల నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక మార్కెట్ కార్యదర్శి శ్రీమతి పోలేపాక నిర్మల కు మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ రెడ్డి హంసా రెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎండి ఇస్మాయిల్ సహాయ కార్యదర్శి గోనె రామచందర్ తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజన్న జిల్లా కోశాధికారి ఊరటి హంసల్ రెడ్డి ఏఐకేఎఫ్ జిల్లా నాయకులు ఐతమ్ నాగేష్ జక్కుల అశోక్ అప్పనపురి నరసయ్య మాలి ప్రభాకర్ పరిమళ గోవర్ధన్ రాజు ఊకంటి గోపాల్ రెడ్డి లడె మోహన్ రావు బొల్లు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ దైవ సంరక్షణతో సమానం

**యాదాద్రి భువనగిరి ఫిబ్రవరి 7( నినాదం ) :** ప్రపంచ పర్యావరణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ సిహెచ్ భద్ర , ప్రధాన కార్యదర్శి కార్యదర్శి నిఖిల్ సాయి కోనేటి ప్రపంచ పర్యావరణ సంస్థ ఉపాధ్యక్షులు కార్యక్రమ నిర్వహకులు మిట్టపల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దేశ్ముఖ్ గ్రామంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ సదస్సు నిర్వహించారు. అమెరికా నుంచి వచ్చిన ప్రపంచ పర్యావరణ సంస్థ గ్లోబల్ చైర్మన్ డాక్టర్ హరి ఇప్పనపల్లి మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి ప్రముఖ పర్యావరణ తత్వవేత్త భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను విద్యార్థుల్లోకానికి ప్రపంచానికి చాటి చెప్పాలన్న ఏకైక లక్ష్యంతో ప్రపంచ పర్యావరణ సంస్థ పర్యావరణ పరిరక్షణ కోసం పని చేస్తూ ఉందన్నారు.ప్రతి ఒక్కరం మన దైనందిన జీవితంలో ప్రకృతి కోసం జీవించాలి ప్రకృతిలోనే జీవించాలి ప్రకృతిని సంరక్షించుకోవాలి అని పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ సంస్థ స్కూల్ ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ ఏ జోష్ణ రావు మాట్లాడుతూ దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న కాలుష్యం మీద విద్యార్థి లోకం గళం విప్పాలన్నారు. భవిష్యత్తు తరాలకి మంచి ఆహారాన్ని మంచి ఆరోగ్యాన్ని విద్యను అందించాలంటే పర్యావరణాన్ని పరిరక్షించినప్పుడే సాధ్యమవుతుందన్నారు. గత 12 సంవత్సరాలుగా ప్రపంచ పర్యావరణ సంస్థ ఏ కార్యక్రమం నిర్వహించిన నేను పాల్గొంటూ యువతకు విద్యార్థులకు నిజమైన దేశభక్తి దైవభక్తి పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం లోనే ఉందని పిలుపునివ్వడం జరిగిందన్నారు. ఈసందర్భంగా హెచ్ ఎండ్ ఆర్ బ్లాక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంస్థ ప్రతినిధులు హరీష్ , ప్రపంచ పర్యావరణ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ భద్ర ప్రసంగించారు.విద్యార్థులు రేపటి భవిష్యత్తు తరాలు గాలిని కొనుక్కునే దయనీయమైన దుస్థితి నుంచి తెలుసుకొని మొక్కలు నాటి అన్ని రకాల కాలుష్యాలను ఓజోన్ లేయర్ పొరను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దయానంద రావు మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించడంలో ఉన్న ఆనందం ఉన్నతృప్తి ప్రపంచంలో మరి ఎక్కడ దొరకదఅన్నారు.ఈకార్యక్రమంలోప్రపంచ పర్యావరణ సంస్థ ప్రధాన కార్యదర్శి నిఖిల్ సాయి , ప్రపంచ పర్యావరణ సంస్థ సహాయ కార్యదర్శి రాజేష్ గౌడ్



ఉపాధ్యక్షుడు ఆర్ వినోద్ రెడ్డి రామకృష్ణ శంకర్ , మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల హెచ్ఎం నాగభూషణం చారి పాఠశాల కళాశాల లెక్చరర్లు ఉపాధ్యాయులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణాన్ని పరిరక్షిస్తామని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈరోజు నుంచి ప్రతిరోజు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ప్రపంచ పర్యావరణ సంస్థ ఉద్యమంలో భాగస్వామ్యం అవుతామని ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థిని విద్యార్థులు నిర్వహించిన వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం చేశారు. విజేతలకు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మెమోరియల్ అవార్డుతో సర్టిఫికెట్ తో సత్కరించారు.ఈసందర్భంగా టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ , భారతరత్న మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు కొడుకు వి ప్రభాకర్ లు పర్యావరణ ఉద్యమానికి సంపూర్ణమైన మద్దతు ప్రకటించారు

## మాపై బురద చల్లడం మానుకోండి

### మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు



**జిన్నారం/పటాన్ చెరు 07(నినాదం న్యూస్):**సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో లో నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్ యార్డ్ విషయంలో మీడియా సమావేశం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015 నుండి ఆగస్టు 2023 వరకు నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్ యార్డ్ కి సంబందించ్చి అన్ని అనుమతులు ఇచ్చింది వారే అన్నారు. వార్డ్ మెంబర్ స్థాయి నుంచి సీఎం వరకు మీ పార్టీ నాయకుల హయాంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అన్ని విధాలుగా మీరే దగ్గరుండి ముందుకు నడిపారని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీపై జిల్లా మంత్రి దామోదర రాజానరసింహ అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలలో పార్టీనపై నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిజమైన నాయకులుయితే బహిరంగా చర్చకు రావాలని సవాలు విసిరారు. మేము మేము ఎల్లప్పుడూ డంపింగ్ యార్డ్కు వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకొని సంయుక్తంగా డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు లేనియెడల మండలంలోని గడపగడపకు మీ హయాంలో వచ్చిన అనుమతి పత్రాలను పాంప్లేట్లు గా పంచి ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. స్వార్ధ రాజకీయాల కోసం పార్టీ మారిన నాయకులు.. ఇప్పటికైనా తాము ఏ పార్టీలో ఉన్నారో నిర్ణయించుకోవాలి.. బహిరంగంగా కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి జిన్నారం మండల పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ గుమ్మడిదలు మండల ఉపాధ్యక్షుడు బొక్క ఆంజనేయులు మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి,దోమడుగు మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, , సీనియర్ నాయకులు పెంటా రెడ్డి,మద్ది ప్రతాప్ రెడ్డి, తులసీదాస్, మహిపాల్ రెడ్డి, బాలు గౌడ్, జంగారెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అజార్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకే పెద్దపీట

### ఓటు అడిగే హక్కు కాంగ్రెస్ కే ఉంది - కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క

**మంగపేట, ఫిబ్రవరి 7 ( నినాదం న్యూస్ ) :** సంక్షేమ పథకాలు అమలు చేయడంలో, అందించడంలో పారదర్శకంగా వ్యవహరిస్తూ పేద ప్రజలకు పెద్దపీట వేస్తామని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ ( సీతక్క ) అన్నారు. మండలంలోని బోరు నరసాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మైల జయరాం రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు .ఈ సందర్భంగా మంత్రి సీతక్క స్థానిక ఎన్నికలపై కార్యకర్తల అభిప్రాయాలను గ్రామాల వారిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు సిద్ధంగా ఉండాలని, పార్టీ లైన్ లోనే ప్రతి ఒక్కరూ పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్యలో ఉండాలని, ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల మధ్యలోకి తీసుకెళ్లాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికే స్థానిక సంస్థలలో టికెట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తుంటే ఓర్చుకోలేక విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాల అమలుతోనే వారి విమర్శలకు సమాధానం చెబుతున్నామని సీతక్క అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు గత 10 సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతమంది రాష్ట్ర ప్రజలకు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రోడ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిన కాంగ్రెస్ పార్టీకే ప్రజలను ఓటు అడుగే హక్కు ఉందని అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ఉపాధి, విద్య, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న కాంగ్రెస్ పార్టీ పై బిఆర్ఎస్, బిజెపి పార్టీలు పనికట్టుకుని విషం కక్కుతున్నాయని అన్నారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ కులగణన చేసి రిజర్వేషన్ ప్రకటించిన



ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. 14 సంవత్సరాలుగా మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదని ఒకవేళ జరిగితే ఈ ప్రాంత ప్రజలకు సుపరిపాలన అందుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామీణ

స్థాయి నుండి కమిటీలు వేసుకొని ప్రభుత్వ పథకాలైన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, ప్రతి పేదవాడికి ప్రభుత్వ ఫలాలు అందుతాయని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను గూర్చి ప్రజలకు తెలియజేస్తూ సర్పంచులను, ఎంపీటీసీలను, జడ్పిటిసిలుగా గెలిపించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు రేగ కళ్యాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, నాయకులు గుమ్మడి సోమయ్య, చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, హిదాయతుల్లా, పూజారి సురేందర్ బాబు, చాద మల్లయ్య, అయ్యోరి యానయ్య, చింతా పున్నారావు, నాసిరెడ్డి సాంబశివ రెడ్డి, మురుకుట్ల నరేందర్, సిద్దాబత్తుల జగదీష్ , ఎర్రంగారి సురేష్, కర్రీ నాగేంద్రబాబు, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# కేంద్ర బడ్జెట్ రాష్ట్రాల వారీగా కేటాయింపులు ఉండవు

### పార్లమెంటులో మాట్లాడిన మల్కాజిగిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ అభినదించిన స్పీకర్..

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి7,(నినాదం న్యూస్):** సభలో మాట్లాడే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదములు. ఎనిమిది నెలల నుంచి నేను పార్లమెంట్ సమావేశాలను గమనిస్తున్నాను. మాజీ ఆర్థిక మంత్రి కాంగ్రెస్ సభ్యుల మాటలు విన్న తర్వాత నాకు ఒక విషయం గుర్తుకు వస్తుంది.. ఈ దేశంలో 50 సంవత్సరాల కంటే ఎక్కువ పరిపాలన చేసింది కాంగ్రెస్ పార్టీ పదేపదే రాజ్యాంగాన్ని పట్టుకొని వస్తున్నారు.. దాని గురించి మాట్లాడుతున్నారు.. వారికి నేను ఒకటి గుర్తు చేయాలి అనుకుంటున్నాను.. ఈ రాజ్యాంగంలో అంబేద్కర్ ఒక ప్రధాన విషయం చెప్పారు. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికి అందాలి ( డెవలప్మెంట్ విత్ ఈక్వల్ డిస్ట్రిబ్యూషన్ ) అని రాశారు. మరి ఈ యాభై సంవత్సరాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో ఆత్మ పరిశీలన చేసుకోవాలని కోరుతున్నాను. దేశంలోనే కాదు వివిధ రాష్ట్రాల్లో కూడా పరిపాలన చేసింది. రాష్ట్రాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టేటప్పుడు జిల్లాల వారీగా కేటాయింపులు ఉండవు. అలాగే కేంద్రం బడ్జెట్ కూడా రాష్ట్రాల వారీగా కేటాయింపులు ఉండవు. దేశంలో ఉన్న రైతులు యువకులు అందరికోసం స్కీములు తీసుకొస్తారు. కానీ కేటాయింపుల విషయంలో కొత్తగా గెలిచి వచ్చిన పార్టీ లాగా కాంగ్రెస్ పార్టీ మాట్లాడటం ఈ ప్రజాస్వామ్యంలో అత్యంత బాధాకరం. 2014 జూన్ రెండో తారీకు నేను మంత్రిని అయ్యాను. అదే రోజు మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఏర్పడింది. అప్పుడు జరిగిన మొదటి సమావేశంలో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నరేంద్ర మోడీ ఒకటే మాట చెప్పారు. రాష్ట్రాలు అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది అనే మూల సూత్రాన్ని చెప్పారు. అందుకే రాష్ట్రాలకు నిధుల కేటాయింపు పెంచారు. ఒక్కో రాష్ట్రం ప్రభుత్వం వారి వారి ప్రాధాన్యతో ముందుకు పోతున్నాయి. 2014 వరకు టాక్స్ డెవల్యూషన్ రాష్ట్రాలకు కేటాయింపులు 32 శాతం ఉండేది. కానీ మోడీ జీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాష్ట్రాలలో అభివృద్ధి జరగాలని 42 శాతానికి పెంచి విప్లవాత్మకమైన మార్పు తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇష్టమొచ్చినట్లుగా కేటాయింపులు చేసుకోవడానికి వీలులేదు. టాక్స్ డివల్యూషన్, సెంట్రల్లీ స్పాన్ సైడ్ స్కీమ్స్ (%ఎ౦౦%), విపత్తులు జరిగినప్పుడు, ఫైనాన్స్ కమిషన్ నిధులు రాష్ట్రాలకు వస్తాయి. తప్ప కేంద్రం నేరుగా ఇవ్వడానికి ఉండదు. కానీ ఈసారి బడ్జెట్లో లక్షా యాభైవేల కోట్లు వివిధ రాష్ట్రాలకు. ఇరిగేషన్ ప్రాజెక్టుల కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం జీరో రేట్ ఆఫ్ ఇంట్రెస్ట్ తో మద్దతు ఇవ్వటానికి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమైన నిర్ణయం. తెలంగాణలో గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల జీతాలు ఇవ్వటాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు. కానీ గ్రామాల్లో ఉన్న డ్రైనేజీ వ్యవస్థకు, చెట్లు పెంచడానికి, కరెంటుకు, రోడ్లకు, చివరికి గ్రామాల్లో పనిచేస్తున్న సఫాయి కార్మికులకు కూడా డబ్బులు ఇస్తుంది కేంద్రమే అనే విషయం మర్చిపోవద్దు. 2014 వరకు రైల్వేస్టేశన్ల ఆధునీకరణకు రెండో,మూడో కోట్లు ఇచ్చి సున్నాలు వేసేవారు. కానీ మోదీ వచ్చిన తర్వాత రైల్వే స్టేషన్లకు హైదరాబాదులో రెండు వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి రైల్వే స్టేషన్లను ఎలా అభివృద్ధి చేస్తున్నారు వెళ్లి చూడమని అభ్యర్థులను కోరుతున్నాను. చర్లపల్లి, సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి వెళ్లి చూడండి రెండు వేల కోట్ల రూపాయలతో పనులు జరుగుతున్నాయి. 450 కోట్ల రూపాయలతో రైల్వే స్టేషన్లో సిద్ధం చేస్తే 50 కోట్ల రూపాయలు ఇచ్చి మౌలిక వసతులు తయారు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేవు. అందుకే రైల్వే మంత్రి సోమన్నను అడిగాము 100 కోట్ల రూపాయలు కేటాయించి మౌలిక వసతులు కల్పించండి లేదంటే 450 కోట్ల రూపాయలు వృధా అవుతాయని కొడితే మంజూరు చేశారు. తెలంగాణలో రైల్వే లైన్లను సింగిల్ లైన్లను, డబుల్ లైన్లు.. ఢిల్లీకి 4వే లైన్లను తయారు చేస్తున్నారు. వేల కోట్ల రూపాయలు రైళ్ల కోసం ఖర్చు పెడుతున్నారు. స్మార్ట్ సిటీలు, అమృత్ నగర్ల పేరుతో వేలకోట్ల రూపాయలు అర్బన్ ఏరియాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి అంటే అది కేవలం కేంద్ర ప్రభుత్వం నిధులు మాత్రమే. వ్యవసాయం గురించి సర్వీస్ సెక్టర్లో, ఇన్కమ్ టాక్స్ ద్వారా పన్నులు ఎక్కువ వస్తాయని తెలుసు వ్యవసాయం మీద వచ్చే ఆదాయం ఎక్కువ రాకపోవచ్చు కానీ 50% ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి ఉన్నారు. అందుకే మొదటిసారి రైతులకు మోడీ సర్కార్ పదకొండు కోట్ల రైతులకు పదివేల రూపాయల చొప్పున ఇస్తున్నారు. గతంలో ఎప్పుడైనా చూసామా ? కనీసం ఆలోచన కూడా చేయలేదు. టుడే ఇస్ ద ఎరా ఆఫ్ జినోమ్ అందుకే శాస్త్ర విజ్ఞానం ఫలాలు ప్రజలకు అందాలని ప్రయత్నం చేస్తున్నారు. అంతర్జాతీయ జర్నల్ రాసింది. భారతదేశం ప్రపంచంలో ఏ దేశానికైనా కరువు వస్తే అన్నం పెట్టగలుగుతుంది. కానీ భారతదేశానికి ఆకలైతే ఎవరూ పెట్టలేరని రాసింది. విమర్శలు పక్కన పెట్టి పనులు చేస్తున్న ప్రభుత్వం మోడీ ప్రభుత్వం. మొదటిసారిగా మత్స్యకారుల కోసం మంత్రిత్వ శాఖ వచ్చింది. గొర్ల స్కీం తెచ్చారు. కోటి రూపాయలలో 50 లక్షల రూపాయలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది. ఈ స్కీం ద్వారా 200 మందికి తెలంగాణలో నిధులు వచ్చినా ఇప్పటివరకు కమిటీ మీటింగ్ పెట్టలేదు, లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. నిరుద్యోగుల గురించి. మన విద్యార్థులు అమెరికాకు వెళ్లి పెట్రోల్ బంకులలో, సూపర్ మార్కెట్లో పని చేసి చదువుకుంటున్నారు.

# కాంగ్రెస్‌తోనే న్యాయవాదుల సమస్యల పరిష్కారం

- అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు కృషి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి



**కరీంనగర్, ఫిబ్రవరి 7(నినాదం న్యూస్):** సుల్తాన్ బాద్‌లి: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు.. శుక్రవారం సుల్తానాబాద్ పట్టణం లో పలువురు పట్టభద్రులను న్యాయవాదులను కలిసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపాలని కోరారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,న్యాయవాదుల చిరకాల వాంఛ అయిన అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలుకు తన వంతుగా కృషి చేస్తానని వెల్లడించారు.తెలంగాణ రాష్ట్రం సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అద్భుతంగా ముందుకు వెళ్తుందని అన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం 55 వేల ఉద్యోగాలు ఇచ్చిందని గుర్తు చేశారు... నాలుగు నెలల ఎమ్మెల్సీ పర్యటనలో చాలా సమస్యలు తమ దృష్టికి వచ్చాయని.. వాటన్నిటిని సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే బాధ్యత తనపై ఉందని గుర్తు చేశారు.. లోటు బడ్జెట్ ఉన్నప్పటికీ రాష్ట్రంలో ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇస్తుందని గుర్తు చేశారు. తాను రాజకీయాలు చేయడానికి ఎమ్మెల్సీగా పోటీ చేయడం లేదని కేవలం నిరుద్యోగ యువతకు అండగా ఉండేందుకే తాను రాజకీయాల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు.

# విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించాలి

- రెస్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి




**కోదాడ, ఫిబ్రవరి 7( నినాదం న్యూస్):** విద్యార్థులు పోటీ పరీక్షలో విజయం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని రేస్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోదాడ నియోజకవర్గస్థాయి పదవ తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్ కు సంబంధించిన విజేతలకు శుక్రవారం రేస్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ లో బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని ప్రజల్లో ఉన్నటువంటి మూఢనమ్మకాలపై వారిని చైతన్యవంతం చేయాలని అన్నారు.విద్యార్థులకు భవిష్యత్తులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ పైన ఆసక్తి కలిగేలా టాలెంట్ నిర్వహించిన ఏఐఎస్ఎఫ్, ఏ ఐ వై ఎఫ్ సంఘాల నాయకులను వారు అభినందించారు.అనంతరం నిర్వాహకులు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ మాట్లాడుతూ... కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల టాలెంట్ కార్యక్రమంలో 494 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో మొదటి బహుమతి సిహెచ్ యామిని (శ్రీ వైష్ణవి కాన్సెప్ట్ స్కూల్)ద్వితీయ బహుమతి రాహుల్ చౌదరి తేజ టాలెంట్ స్కూల్ తృతీయ బహుమతి వి హర్షవర్ధిని (జయ హై స్కూల్) చతుర్ధ బహుమతి బి సందీప్ రెడ్డి(గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్) పంచమ బహుమతి ఎం గౌతమ్ చరణ్ (సైదయ్య కాన్సెప్ట్ స్కూల్) లకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బహుమతుల దాతలు పింగ్రాతి హనుమంతరావు, సిరాపరపు శ్రీనివాసరావు, అంబాల వెంకటి, త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాస్ ,పదిరె మహేష్ రెడ్డి, మండవ మధు, రమేష్ ,మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# డీటీసీ ఇంట్లో ఏసీబీ రైడ్స్





- డీటీసీ పుప్పాల శ్రీనివాస్ ఇంటిలో బయటపడ్డ నోట్ల కట్టలు, ఆభరణాలు
- అధికారులు అవాక్కయ్యేలా ఆదాయానికి మించి ఆస్తులు
- వరంగల్ జిల్లా రవాణా అధికారి నివాసంలో అవినీతి నిరోధకశాఖ దాడులు
- హన్మకొండ, హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాలలో తనిఖీలు పక్కా సమాచారంతో సోదాలు

**వరంగల్ బ్యూరో, (నినాదం న్యూస్ ):** వరంగల్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ పుప్పాల శ్రీనివాస్ ఇంట్లో ఏసీబీ దాడులు కలకలంరేపాయి. ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఫిర్యాదుతో హనుమకొండ జిల్లా కేంద్రం పలివేల్పులలోని డీటీసీ నివాసంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. పక్కా సమాచారంతో హన్మకొండతోపాటు హైదరాబాద్, కరీంనగర్, జగిత్యాలలోని శ్రీనివాస్ బంధువుల ఇండ్లలోనూ నాలుగు టీంలు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. అయితే లెక్కకు మించిన ఆస్తులున్నట్లు ఏసీబీ సోదాల్లో వెల్లడయినట్లు తెలిసింది. సుమారు యాభై కోట్ల రూపాయల మేరకుపైగా ఆస్తులను శ్రీనివాస్ కూడబెట్టినట్లు ఏసీబీ విచారణలో వెల్లడైనట్లు సమాచారం. అంతేగాక.. సోదాల సందర్భంగా భారీగా నగదుతోపాటు బంగారం, వెండి ఆభరణాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆదిలాబాద్ డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ అధికారిగా పనిచేసిన పుప్పాల శ్రీనివాస్ గతేడాది ఫిబ్రవరిలో వరంగల్ జిల్లాకు బదిలీపై వచ్చారు. ఆదాయానికి మించి అక్రమాస్తులు కూడబెట్టారని ఆయనపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కాగా.. వరంగల్? డీటీసీ నివాసాల్లో ఏసీబీ దాడులు రవాణాశాఖలో తీవ్ర కలకలంరేపాయి. ముఖ్యంగా అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

## ఘనంగా మాత రమాబాయి అంబేద్కర్ జయంతి వేడుకలు



**మల్యాల, ఫిబ్రవరి 7( నినాదం న్యూస్):** ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సతీమణి మాత రమాబాయి భీమ్రావు అంబేద్కర్ 127 వ జయంతి సందర్భంగా శుక్రవారం బ్లాక్ చౌరస్తా లోని అంబేద్కర్ విగ్రహం ముందు రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అంబేద్కర్ సంఘం మాజీ అధ్యక్షుడు మల్యాల ఈశ్వర్ , ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నలువాల సంజీవ్ ,మునుగూరి శంకర్, ధొనకొండ అనిల్, ఎడిపెల్లి రాజన్న ,పొడేటి గంగారం తిరుపతి, గంగాధర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనం సీజ్

### -నలుగురి పై కేసు నమోదు




**కొమురం భీం ఆసిఫాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 07(నినాదం న్యూస్):** కొమురంభీం జిల్లా సిర్పూర్ లో శుక్రవారం ఉదయం అక్రమంగా పశువులను తరలిస్తున్న బొలెరో వాహనాన్ని పట్టుకున్నట్టు సిర్పూర్ ఎస్ఐ కమలాకర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శ్రీనివాస్ రావు, కాగజ్‌నగర్ డిఎస్పీ రామానుజం, కౌటాల సిఐ. ముత్యం రమేష్ ఆదేశాల మేరకు శుక్రవారం తెల్లవారుజామున వచ్చిన పక్కా సమాచారం తో సిర్పూర్ (టి) పోలీసు స్టేషను పరిధిలో అక్రమ పశువులను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. కౌటాల నుండి పెద్దపల్లి జిల్లా జూలపల్లి కి వెళ్తున్న టీఎస్ 21 టీ 1100 నెంబర్ బొలెరో వ్యాన్ ను పట్టుకోని ఐదు పశువులను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై తెలిపారు. పశువులను రవాణా చేస్తున్న కుమ్మ కుమార్, కాంపెల్లి కరన్ లతో పాటు యాజమానులైన రాజమల్లు, వెంకట్ రెడ్డి లపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు. పశువుల అక్రమ రవాణా పై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. అక్రమంగా పశువులను రవాణా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## ఆర్థిక సహాయం అందించిన శాలివాహన కమిటీ

### -మృతురాలి కుటుంబానికి 12,000 సహాయం అందజేత



**కోదాడ/అనంతగిరి, ఫిబ్రవరి 7(నినాదం న్యూస్):** అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన నిమ్మనగొట్టు మంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలు కుటుంబానికి అండగా ఖానాపురం శాలివాహన (కుమ్మరి) కమిటీ 12వేల రూపాయలు ఆర్థిక సహాయం మంగమ్మ కుమారులు కు అందజేసారు.ఈ సందర్భంగా శాలివాహన నాయకులు మాట్లాడుతూ... వెనుకబడిన శాలివాహన కులస్తులను ఆర్థికంగా ఆదుకోవడం జరుగుతుందని, గ్రామంలో శాలివాహన కుటుంబంలో ఎవరైనా చనిపోతే కుటుంబానికి 500 చొప్పున వసూలు చేసి బాధిత కుటుంబానికి అందజేస్తామని తెలిపారు.

# కొల్లూరు డబుల్ బెడ్రూంలలో అన్ని రకాల వసతులు కల్పించాలి





**- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు**

**- నూతన పట్టణాన్ని తలపించేలా 2 బిహెచ్ కె కాలనీలో వసతులు కల్పించాలి**

**- కాలనీలో 7258 కుటుంబాలకు చెందిన 30 వేల జనాభా**

జిన్నారం/ పటాన్ చెరు ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్)తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు టు బిహెచ్ కెలో అన్ని రకాల వసతులు కల్పించాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు రామచంద్రాపురం మండలం, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూరు టు బిహెచ్ కె కాలనీలో, కాలనీ ప్రజలు, జిహెచ్ఎంసి అధికారులు, విద్యాశాఖ, సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, వివిధ ఇంజనీరింగ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కాలనీలో ఇప్పటివరకు 7258 కుటుంబాలకు చెందిన సుమారు 30 వేలకు పైగా జనాభా నివసిస్తున్నట్లు తెలిపారు. ఇంకో 30 వేల మంది జనాభా కాలనీకి వచ్చే అవకాశం ఉందన్నారు. కాలనీలో పట్టణాన్ని తలపించేలా అన్ని రకాల వసతులు కల్పించాలని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, అంగన్వాడీ కేంద్రము, తాగునీటి వసతి, మురుగునీటి పారుదల వ్యవస్థ,లిఫ్ట్ మరమ్మత్తులు, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు,బస్సు సౌకర్యం, టెలి కమ్యూనికేషన్స్ సౌకర్యం, రేషన్ దుకాణం, పోలీస్ సెక్యూరిటీ తదితర అన్ని రకాల సౌకర్యాలు కాలనీలో ఏర్పాటు అయ్యేలా అధికారులు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. కొల్లూరు ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబాలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఈ సందర్భంగా చర్చించారు. కొల్లూరు టు బిహెచ్ కె కాలనీలో మరింత ఎక్కువ మంది ప్రజలు స్థిరపడే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో గ్రామంలో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రస్తుత అవసరాలకు సరిపోవని ఈ నేపథ్యంలో గ్రామానికి మానవీయమైన, సాంకేతిక మౌలిక సదుపాయాలు గురించి వచ్చిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కాలనీలో నివసించే కుటుంబాలకు చెందిన పిల్లలకు ప్రాథమిక విద్య అనేది చాలా కీలకమైనదని, దీని ఇందుకోసం ప్రాథమిక పాఠశాలను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థుల సంఖ్యకు సరిపడా అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని చర్యలు చేపట్టాలని విద్యా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉన్నత పాఠశాల కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. కాలనీలో అంగన్వాడీ కేంద్రము, ప్రాథమిక పాఠ శాల, ఉన్నత పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. కాలనీ ప్రజలకు మెరుగైన వైద్య సౌకర్యాల కల్పన కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, జనాభా సంఖ్య కనుగుణంగా ఆశా కార్యకర్తలను, ఏఎన్ఎం లను సబ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. టు బిహెచ్ కె కాలనీలో తాగునీటి వసతి మురుగునీటి వ్యవస్థ ఏర్పాటు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, మిషన్ భగీరథ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కాలనీలోని ప్రతి నివాస గృహానికి తాగునీటి వసతి కల్పించాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న తాగునీటి వసతి వ్యవస్థకు అదనంగా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కాలనీలోని వివిధ టవర్లలో లిఫ్ట్ వ్యవస్థలు మరమ్మత్తులకు చేపట్టాల న్నారు. లిఫ్ట్ లలో సమస్య తెలిసేలా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయా లని అధికారులు సూచించారు. పెద్ద మొత్తంలో కొల్లూరు టు బిహెచ్ కెలో ప్రజలు నివసించే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లు డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాల న్నారు. రోడ్లపై మురు గునీరు ప్రవహించకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటుపై ఇంజనీర్లు దృష్టి సారించాల్సి నా అవ సరం ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు అవసరమైన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే నిధులు మంజూరయ్యాయి చేసేలా చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కాలనీలోని ప్రజలు వివిధ ప్రాంతాల నుండి ఎక్కువగా రాకపోకలు సాగించే విధంగా అవసరమైన రూట్లో బస్సు సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాలనీ ప్రజలకు మెరుగైన టెలికమ్యూనికేషన్స్ సేవలు అందించేలా ప్రభుత్వ ప్రైవేటు రంగాల ద్వారా సెల్ టవర్లు ఏర్పాటు చేయడంతో పాటు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించేలా బిఎస్ఎన్ఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని. కలెక్టర్ బిఎస్ఎన్ఎల్ అధికారులకు సూచించారు. కాలనీ ప్రజలకు అందరూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారిని వారికి ప్రతి నెల రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసర సరుకులు సరఫరా చేసే విధంగా కుటుంబాల సంఖ్య జనాభా సంఖ్య ఆధారంగా ఎన్ని రేషన్ దుకాణాలు అవసరము ఆయన అన్ని రేషన్ దుకాణాలు ఏర్పాటయ్యాలా చూడాలని కాలనీలో నివసించే వారికే నూతన రేషన్ డీలర్ షిప్లు మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాలనీవాసులకు రక్షణ కల్పించడం కోసం పోలీస్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. రాత్రి సమ యాలలో దొంగతనాలు జరగకుండా నిరంతరం పోలీస్ పెట్రోలింగ్ జరిగేలా అవసరమైన పోలీస్ సిబ్బంది నియమించాలని పోలీస్ శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. కాలనీలో లో వోల్టేజ్ సమస్యలు ఎత్తకుండా అవసరమైన పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్కో అధికారులకు కలెక్టర్ సూచించారు. జిహెచ్ఎంసి రెవెన్యూ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఈ ప్రజల సమస్యలను సత్వారం పరిష్కరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. శాఖల మధ్య సంబంధాలు సజావుగా ఉండాలని అప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయి అన్నారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి సమస్యల పరిష్కారం కోసం అవసరమైన అభివృద్ధి పనుల నిర్మాణం కోసం త్వరతగతన నిధులు మంజూరు ఎలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ క్రాంతి వల్లూరు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిణి లలిత కుమారి, సంగారెడ్డి ఆర్డీవో రవీందర్ రెడ్డి, రామచంద్రాపురం తహశీల్దార్ సంగ్రామ్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారులు, సంబంధిత అధికారులు, కాలనీ ప్రజలు, ఆయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాపై బురద చల్లడం మానుకోండి

- **ప్యారానగర్ డంపింగ్ యార్డ్ విషయంలో మా పై తప్పుడు ప్రచారం**
- **కేవలం రాబోయే స్థానిక ఎన్నికల కోసం తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు**
- **గతంలో డంపింగ్ యార్డ్ కి పర్మిషన్ ఇచ్చింది మీరే కదా కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం**
- **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మీడియా సమావేశం**

జిన్నారం/పటాన్ చెరు 07(నినాదం న్యూస్) సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్ట నర్సింగ్ రావు ఆధ్వర్యంలో లో నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్ యార్డ్ విషయంలో మీడియా సమావేశం నిర్వహించారు అనంతరం వారు మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2015 నుండి ఆగస్టు 2023 వరకు నల్లవల్లి ప్యారానగర్ డంపింగ్ యార్డ్ కి సంబందించ్చి అన్ని అనుమతులు ఇచ్చింది వారే అన్నారు. వార్డ్ మెంబర్ స్థాయి నుంచి సీఎం వరకు మీ పార్టీ నాయకుల హయాంలోనే డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అన్ని విధాలుగా మీరే దగ్గరుండి ముందుకు నడిపారని అన్నారు. నేడు కాంగ్రెస్ పార్టీపై జిల్లా మంత్రి దామోదర రాజానరసింహ అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రజలలో పార్టీనపై నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిజమైన నాయకులుయితే బహిరంగా చర్చకు రావాలని సవాలు విసిరారు. మేము మేము ఎల్లప్పుడూ డంపింగ్ యార్డ్కు వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకొని సంయుక్తంగా డంపింగ్ యార్డ్ కు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు లేనియెడల మండలంలోని గడపగడపకు మీ హయాంలో వచ్చిన అనుమతి



పత్రాలను పాంప్లెట్లు గా పంచి ప్రజలకు వివరిస్తామని హెచ్చరించారు. స్వార్థ రాజకీయాల కోసం పార్టీ మారిన నాయకులు.. ఇప్పటికైనా తాము ఏ పార్టీలో ఉన్నారో నిర్ణయించుకోవాలి.. బహిరంగంగా కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి జిన్నారం మండల పార్టీ అధ్యక్షుడు వడ్డే కృష్ణ గుమ్మడిదలు మండల ఉపాధ్యక్షుడు బొక్క ఆంజనేయులు మాజీ మండల అధ్యక్షుడు మద్ది వీరారెడ్డి,దోమడుగు మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్, , సీనియర్ నాయకులు పెంటా రెడ్డి,మద్ది ప్రతాప్ రెడ్డి, తులసీదాస్, మహిపాల్ రెడ్డి, బాలు గౌడ్, జంగారెడ్డి, మండల మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అజార్, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొత్తకొండ ఆలయ చైర్మన్ పరామర్శించిన మంత్రి



**భీమదేవరపల్లి ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొమురవెల్లి చంద్రశేఖర్ గుప్తా తల్లి మణెమ్మ ఇటీవల మరణించారు. కాగా శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలోని చంద్రశేఖర్ ఇంటికి మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్లారు. ఆయనతో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. మంత్రితో పాటు సిద్దిపేట గ్రంథాలయ చైర్మేన్ కేడం లింగమూర్తి తదితరులు ఉన్నారు

## కమిషనర్‌ను కలిసిన సీఐటీయూ నాయకులు



**చేవెళ్ల ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** చేవెళ్ల నియోజకవర్గం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని స్థానిక అజీజ్ నగర్ లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన సిఐటియు ఆధ్వర్యంలో నూతన మున్సిపల్ కమిషనర్ ను కలిశారు.అనంతరం వారికీ శాలువాతో సన్మానించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఏ సమస్య ఉన్నవారికి తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అండగా ఉంటుందని అన్నారు మొయినాబాద్ నూతన పురపాలక సంఘంగా ఏర్పడిందని మొయినాబాద్ పురపాలక సంఘం పారిశుధ్య పనులలో కార్మికులు శక్తి వంచన లేకుండా కృషి చేస్తారని పురపాలక సంఘంలో ఉన్నటువంటి ప్రజలకు అంటు రోగాలు రాకుండా పకడ్బందీగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తారని అన్నారు. అదే విధంగా నూతన మున్సిపల్ ఏర్పడిన సందర్భంగా కార్మికులకు యూనిఫామ్స్,గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు రత్నం, సుధాకర్, మాణిక్యం, లింగం, నరసింహ, యేసు తదితరులు పాల్గొన్నారు.

### భరతమాత మండల సమైక్యను
## సందర్శించిన లడక్ బృందం




**భీమదేవరపల్లి ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో శుక్రవారం కేంద్ర పాలిత ప్రాంతం అయినా లడక్ నుండి 18 మంది సభ్యుల బృందం 2 సార్లు నేషనల్ అవార్డ్ తీసుకున్న భీమదేవరపల్లి భారతమాత మండల సమాఖ్యను సందర్శించారు. అందులో భాగంగా భారతమాత మండల సమాఖ్య ఆర్ జి బి సమావేశం అధ్యక్షురాలు పొలు రజిత అధ్యక్షతన సమావేశం జరగగా లడక్ కేంద్ర పాలిత ప్రాంతం నుండి వచ్చిన బృందం మండల సమాఖ్య యొక్క పని తీరు సంఘాల యొక్క పనితీరు బుక్స్ వ్రాయడం,జీవనోపాదులు గురించి తెలుసుకున్నారు. ఈ బృందానికి ట్రెయినర్స్ గా ఇసంపెల్లీ శ్రీనివాస్,సోమ వెంకట్రావ్ ,బేతి యాదగిరి రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో అదనపు డి ఆర్ డి ఓ సుధీర్, డిపిఎం అనిల్, ఎపిఎం దేవానంద్, సీసీలు, ఈసీ మెంబర్స్ పాల్గొన్నారు.

## అంబేడ్కర్ విగ్రహం తొలగించొద్దని వినతులు

**భీమదేవరపల్లి ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రం నుండి సిద్దిపేట వరకు జాతీయ రహదారి పనులు గత సంవత్సర కాలంగా కొనసాగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో రోడ్డు మధ్యలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం, బస్టాండ్ ముందు ఉన్న అమరుల స్తూపం తొలగించవద్దని శుక్రవారం ప్రజా సంఘాల నాయకులు ఆర్డీవో రమేష్ రాథోడ్ కు విజ్ఞప్తి చేసారు. రోడ్డు మధ్యలో అంబేడ్కర్ విగ్రహం, పక్కన అమరుల స్తూపం ఉంది. ఇక్కడ హైవే విస్తరణ పనులు జరుగుతుండగా, కూడలిగా అభివృద్ధి చేయాలని పలువురు జిల్లా కలెక్టర్ కు విన్నవించారు. ఈ నేపథ్యంలో ఆర్డీవో పరిశీలించారు. విజ్ఞప్తులు జిల్లా కలెక్టర్, హైవే పీడీకి పంపించనున్నట్లు తెలిపారు.

# వేడుకలకు హాజరైన కొలను హనుమంతరెడ్డి





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్)** దుండిగల్ మున్సిపాలిటీ బౌరంపేట్ మాజీ కౌన్సిలర్ సరిగారి శ్రీనివాస రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి పూజలో కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కార్య క్రమంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

**వధూవరులను ఆశీర్వదించిన కొలను**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం 125 డివిజన్ సుదర్శన్ రెడ్డి బంధువు వివాహ వేడుకలలో పొలను హనుమంత రెడ్డి పాల్గొని నూతన వధువు వరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అంజాద్, ప్రశాంత్ రెడ్డి, ధర్మ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పరికిచెరువును కాపాడుకుందాం: చెరువుల పరిరక్షణ కమిటీ







**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 7 (నినాదం న్యూస్):** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జగద్గిరిగుట్ట, కూక ట్పల్లి, గాజులరామారం ప్రాంతాలకు విస్తరించి ఉన్న పరికిచెరువు అక్రమార్కుల స్వార్ధానికి అన్యాక్రాంతమయితుందని దీనిని కాపాడుకోవా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉన్నదని చెరువుల పరిరక్షణ కమిటీ పేర్కొన్నారు. ఒకవేళ పరికిచెరువును కాపాడు కోలేకపోతే రాబోయే కాలం తీవ్ర నీటి ఎద్దడిని ఎదుర్కొనే దుస్థితి ఏర్పడుతుందని గత సంవత్సరం బెంగళూరులో జరిగిన ఆ నీటి కొరత ఏర్పడి ప్రజలు మంచి నీటి కోసం అల్లాడాల్సిన పరిస్థితి ఏర్పడుతుం దని ఉదహరించారు. గాజులరామారం, కూక ట్పల్లి, జగద్గిరిగుట్ట ప్రాంతవాసులందరూ పరికి చెరువు పరిరక్షణ కొరకు తమ వంతుగా పాటుపడాలని కోరుతూ శుక్రవారం మక్దుమ్ నగర్ లో చెరువుల పరిరక్షణ కమిటీ సమా వేశాన్ని ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణపై దిశా నిర్దేశం చేశారు. 62 ఎకరాలు విస్తీర్ణం కలిగి ఉండాల్సిన పరికిచెరువు నేడు కబ్జాదారుల చేతిలో బందీగా మిగిలిపోయి ఆక్రమణలకు గురికాగా నేడు 10 నుంచి 15 ఎకరాల లోపు మాత్రమే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దీన్ని కాపాడుకో లేకపోతే రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి సమస్యలు ఏర్పడతాయని వెంటనే పరికిచెరువు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రజల సౌకర్యార్థం వాకింగ్ ట్రాక్ ని ఏర్పాటు చేస్తే ఉపయోగపడుతుందని కమిటీ సూచించారు. మూడు వారాల క్రితం హైడ్రా కమిషనర్ పరికిచెరువుని సందర్శించి పరికిచెరు వును కాపాడుతానని గత సమావేశంలో కూడా చెప్పడం జరిగింది. కానీ నేడు మళ్లీ భూకబ్జాదా రులు పరికిచెరువులో మట్టిని పోసి పూడుసు న్నారు. ఈ విషయాన్ని మరోసారి హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకురావాలి, ప్రజాదర్బార్ లో సహితం ఫిర్యాదు చేసి పరికిచెరువు ను పరిరక్షించుకుం దాం అని తీర్మానం చేశారు. పరికి చెరువును పరిరక్షించడంలో రాజకీయ పార్టీల నాయకులు, పార్టీలకు అతీతంగా నాయకులందరూ కలిసి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చెరువుల పరిరక్షణ కమిటీ సభ్యులు ఉమా మహేష్, సాయి కుమార్ పంతుల, పవన్, జంబు, మోహన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తాం..

**హెల్త్ కార్డులపై త్వరలో సమీక్ష**
**టీడబ్ల్యూజేఎఫ్ నాయకులతో మంత్రి దామోదర**

**మేడ్చల్ ప్రతినిధి, ఫిబ్రవరి7(నినాదం న్యూస్):** జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా తెలిపారు. హెల్త్కార్డుల విషయంలో త్వరలో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులతో సమీక్ష చేస్తానని ప్రకటించారు. ప్రజలు, జర్నలిస్టుల ఆరోగ్యం విషయంలో రాజీపడేది లేదన్నారు. అందుకే ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచినట్టు వివరించారు. శుక్ర వారం హైదరాబాద్ బంజారాహిల్స్ లో ఉన్న మంత్రుల నివాస సముదాయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్(టీడబ్ల్యూజే ఎఫ్) ప్రతినిధి బృందం మంత్రిని కలిసింది. ఈ సందర్భంగా దీర్ఘకాలి కంగా హెల్త్కార్డులు సరిగ్గా పనిచేయడం లేదని మంత్రి దృష్టికి తెచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్నా ప్రయివేటు. కార్పొరేట్ ఆసుపత్రులు పట్టించుకోవడం లేదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఉద్యోగుల కోసం రూపొందిస్తున్న కొత్త ఆరోగ్య పథకాన్ని జర్నలిస్టులకూ వర్తింపజేయాలని కోరారు. ఉ ద్యోగుల నుంచి వసూలు చేసే ఒక శాతం కంట్రిబ్యూషన్ను జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు.



ఇందుకు స్పందించిన మంత్రి ఈ విషయాన్ని పరిశీలిస్తామని ఫెడరేషన్ నాయకత్వానికి హామీ ఇచ్చారు. త్వరలో ఆరోగ్యశ్రీ అధికారులతో జర్నలి స్టుల విషయమై సమీక్ష చేసి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. బసవపున్న య్య, ఉపాధ్యక్షులు గుడిగ రఘు, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి. విజయ, హెచ్ఐయూజే అధ్యక్షులు బి. అరుణ్కుమార్, బి. జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# కొవ్వొత్తిలా కరుగుతూ జాతికి జీవం పోసిన మాతృ మూర్తి రమాబాయి అంబేద్కర్

- **అంబేద్కర్ యువ సంఘం అధ్యక్షులు బేగరి లక్ష్మణ్.**

**చేవెళ్ల ఫిబ్రవరి07(నినాదం న్యూస్):** తను కొవ్వొత్తిల కరిగిపోతు మనందరి జీవితాల్లో వెలుగులు నింపిన మాతృమూర్తి మాత రమాబాయి అంబేద్కర్ అని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు బి.లక్ష్మణ్ అన్నారు. మాతా రమాబాయి అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని చేవెళ్ల నియోజకవర్గం శంకర్పల్లి మండలం పర్వేద గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మాత రమాబాయి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంబేద్కర్ యువజన సంఘం అధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు బేగరి లక్ష్మణ్ మాట్లాడుతూ మాత రమాబాయి అంబేద్కర్ త్యాగం మరువలేదని, ఆమె జీవితాన్ని దేశంలోని మహిళలు యువతులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. మతా రమాబాయి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దేశంలో సామాజిక న్యాయం సమానత్వం హక్కులు కోసం పోరాడుతున్న సమయంలో అంబేద్కర్ కు వెన్న అంటూ ఉండి అండగా నిలిచిందని ఆమె ఆదర్శ మహిళ త్యాగానికి ప్రతిరూపమని అమ్మతనానికి నిలువెత్తు నిదర్శనం,కళ్ళ ముందు కడుపున పుట్టిన కొడుకులను కోల్పోయిన చెక్కుచెదరని ఆమె ధైర్యం మహిళ లోకానికి ఆదర్శం, ఆమె జీవితాన్ని ఆదర్శప్రాయంగా తీసుకొని ప్రతి ఒక్క మహిళా ముందుకు వెళ్లాలని సూచించారు. ఆమె ఓర్పు విధేయత వినమ్రతతో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను ప్రపంచ మేధావిని చేసిందని పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి కె.కుమార్, టి.నర్సిములు(టిఎన్ఆర్), బి.సుధాకర్(బీఎస్ఆర్),కె.నర్సిములు పాల్గొన్నారు.